





WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724


తెలుగు దినపత్రిక

# విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY







సెప్టెంబర్ 7 సోమవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 215 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

MONDAY SEPTEMBER 7 2026 | VOL:18 | ISSUE: 215 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed





నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పర్యటన ప్రజ లు విజయవంతం చేశారు. నియోజక వర్గ ప్రగతి బాటలో భాగంగా.. మొత్తం రూ"344.92 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శనివారం సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. నకిరేకల్ పట్టణంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రజా వికాస సభలో ఆయ న మాట్లాడుతూ..బిఆర్ఎస్ ప్రభుత్వం పై ఆయన నిప్పులు చెరిగారు తెలంగాణ తులసి వనంలో చీడ లా ఉన్న బీఆర్ఎస్ గంజాయి మొక్కను పీకేస్తామ ని,త్వరలో సిరిసిల్ల, సిద్దిపేటలపై దండయాత్ర చేస్తామ ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బావ, బావమరుదులు బంధువులనే తెచ్చు కుంటారో, బానిసలనే తెచ్చుకుంటారో, చెంచాగాళ్లని రప్పించుకుంటారో తేల్చుకోవాలని సవాల్ చేశారు. కేసీఆర్ కాస్కో.. రాష్ట్రంలో మళ్లీ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే. సవాల్ చేసి చెబుతున్నా.. ఇప్పుడున్న 119 సీట్లతోనే ఎన్నికలొస్తే 90 స్థానాలు, సీట్లు పెరిగితే 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుంది. 2034 వరకు ఇందిరమ్మ పాలన కొనసాగు తుంది. కేసీఆర్.. రాసి పెట్టుకో.. మీకు ఈ రాష్ట్రంలో భవిష్యత్ లేదు. ఇక చీకటే" అని స్పష్టం చేశారు. శనివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. రూ. 344 కోట్ల వ్యయంతో చేపట్టిన 12 అభివృద్ధి పనులతో పాటు.. రూ.32 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల

(మిగతా 2వ పేజీలో..)

## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

**కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్**

**కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారని కవిత మండిపాటు**

**కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరిక**

తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు

(మిగతా 2వ పేజీలో..)



## అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్.. భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం**

**కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు**

**సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి**

**అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం**

**ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది.ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం

(మిగతా 2వ పేజీలో..)



## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా.. వాళ్లంతా బయటకొచ్చారు: ప్రధాని మోదీ

**'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ**

**2008 ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని విమర్శ**

**కరోనా, యుద్ధం వంటి సంక్షోభాలను తన ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని వెల్లడి**

**భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ఆశలు నెరవేరడం లేదని వ్యాఖ్య**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక

(మిగతా 2వ పేజీలో..)






విజయకెరటం
తెలుగు దినపత్రిక



# సంపాదకీయం

## ఓటు హక్కు హరణం... ఎన్నికల సంఘం బాధ్యత ఎక్కడ?

భారత ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం ఒక అవకాశం కాదు. అది రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కు. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే ఏకైక మార్గం. అయితే ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃపరిశీలన (సర్) ప్రక్రియ ఈ హక్కును హరించేలా మారిందన్న ఆందోళన ప్రజల్లో ఉంది. ఈ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణ కూడా ఉంది. చిన్న చిన్న అనుమానాలతో అర్హులను ఓటు హక్కు నుంచి దూరం చేయడం ప్రాథమిక హక్కును హరించడమే అవుతుంది. 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ప్రక్రియలో సుమారు 36 కోట్ల ఓటర్లు ఉన్న జాబితా నుంచి దాదాపు 6 కోట్ల మంది పేర్లను తొలగించారు. ఢిల్లీలో ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరిని అనర్హులుగా ప్రకటించారు. మహారాష్ట్రలో 2 కోట్లకు పైగా, కర్ణాటకలో 1.07 కోట్లు, తెలంగాణలో 73 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 44 లక్షలు, జార్ఖండ్‌లో 43 లక్షల పేర్లు తొలగుంచబడ్డాయి. పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాదాపు 90 లక్షల పేర్లు తొలగించిన విషయం తెలిసిందే.ఈ తొలగింపులన్నీ సరైన ధ్రువీకరణ లేకుండా, తగిన అవకాశం ఇవ్వకుండా జరిగాయన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఎన్నికలు జరగక ముందే ట్రిబ్యునళ్ల ముందు వాదన వినిపించే అవకాశం చాలా మందికి దక్కలేదు. పశ్చిమ బెంగాల్‌లో అప్పీలు చేసిన 82,782 మందిలో 75,443 మందికి (91 శాతం) తిరిగి ఓటు హక్కు కల్పించిన విషయాన్ని బట్టి ఈ ప్రక్రియలో ఎంత అన్యాయం జరిగిందో స్పష్టమౌతుంది. అంటే ఎన్నికల సమయానికి అనర్హులుగా ప్రకటించిన వారిలో అత్యధికులు అర్హులే అని తేలింది. ఓటర్ల జాబితా సవరణ అవసరమే. డూప్లికేట్ పేర్లు, చనిపోయినవారు, వేరే చోటికి మారినవారు ఉండకూడదు. కానీ ఆ ప్రక్రియను నిర్వహించే విధానం ప్రశ్నార్థకంగా మారింది. భారం ఓటర్లపై పడుతోంది. తమ పేరు జాబితాలో ఉండాలంటే తామే అర్హతను నిరూపించుకోవాలని చెప్పడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. జాబితాను తయారు చేసేది ఎన్నికల సంఘమే కాబట్టి, తొలగించే ముందు తగిన ఆధారాలు చూపించాల్సిన బాధ్యత కూడా దానిదే.ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఓటరు జాబితా నుంచి పేరు తొలగించడం కేవలం ఓటు హక్కుకే పరిమితం కావడం లేదు. రేషన్ కార్డు, పాస్‌పోర్ట్, ప్రభుత్వ పథకాలు వంటి ఇతర హక్కులు, సేవలు కూడా ప్రభావితమవుతున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటర్ల జాబితాను పౌరసత్వంతో ముడిపెట్టడం మరింత ప్రమాదకరం. పౌరసత్వం ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కాదు. ఓటరు లిస్టులో స్పెల్లింగ్ మిస్టేక్ ఉందని లేదా సపోర్ట్ దాక్యుమెంట్ల లో పేరు తప్పుగా ఉందనే సాకుతో నోటీసులిస్తున్నారు. చిన్న పాటి అక్షరదోషాన్ని కూడా ఎత్తి చూపి..ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎక్కడ తమ పేరు ఓటరు లిస్టులోంచి తొలగించబడుతుందోనని భయపడిపోతున్నారు జనం.రాజ్యాంగం తమకు కల్పించిన హక్కును పొందేందుకు సామాన్యులు నానా అవస్తలు పడుతుంటే.. ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను తన విజయంగా ప్రచారం చేస్తోంది. న్యాయవ్యవస్థ కూడా ఈ విషయంలో తగినంతగా జోక్యం చేసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ఓటు హక్కు పిల్లల ఆట కాదు. దానిని తేలికగా చూడలేం. రాజ్యాంగం ప్రకారం ప్రజలే రాజకీయ అధికారానికి మూలం. అర్హులైన పౌరులు ఓటు వేయలేని పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య ప్రాతినిధ్యమే దెబ్బతింటుంది. ఎన్నికల సంఘం తన పద్ధతులను సమీక్షించుకోవాలి. అవసరమైతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాల్సిన అవసరం ఉంది.

సమీ, సీనియర్ జర్నలిస్ట్.

## అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్.. భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు."ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు.అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు.ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా.. వాళ్లంతా బయటకొచ్చారు: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు. "అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు.గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు.అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు.తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్-19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు.2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు ప్రధాని హోదాలో అదే వేదికపై నుంచి ప్రసంగించడం గమనార్హం.

## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



## కెసిఆర్ నీకు తెలంగాణలో భవిష్యత్తు లేదు: సీఎం రేవంత్ రెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతీయ ఆస్పత్రిని ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల, సిద్దిపేట ల్లోనూ కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పారు. ఈ నెలాఖరులో సిరిసిల్లలో, వచ్చే నెలలో సిద్దిపేటపై దండయాత్ర చేస్తామని.. కాంగ్రెస్ శ్రేణుల అండతో పార్టీ జెండా రెపరెపలాడి స్తామని చెప్పారు. విపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రావాలని, లేకపోతే గౌరవంగా రాజీనామా చేసి తప్పుకోవాలని సీఎం రేవంత్ స్పష్టం చేశా రు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, వెయ్యి రోజుల తమ ప్రజా ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో చర్చించ డానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 1000 రోజుల ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్కరోజైనా సభకు రాలేదు. కానీ రూ. 22,24.40.000 కోట్ల జీతభత్యాలు ఉండటానికి ఇల్లు, తిరగడానికి కారు ప్రభుత్వం నుంచి తీసుకుని ఫాంహౌస్ కు వెళ్లిపోయారు. ప్రజల చెమట, రక్తం తో కట్టిన పన్నుల డబ్బును దొబ్బితింటున్న ఈ నాయకుడిని డిస్మిస్ చేయాలా, వద్దా?.. ప్రజలు ఆలోచించాలి అని రేవంత్ వ్యాఖ్యానించారు. అధికారులు 365 రోజులు పనిచేయక పోతే తీసేస్తారని, వెయ్యిరోజులు పని చేయని నాయకుడిని ఏం చేయాలని ప్రశ్నించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక



# సేవా కార్యక్రమాలతో ఇనగాల జన్మదిన వేడుకలు ఘనం






**320 మంది రక్తదానం.. రక్తదాతలకు టి-షర్టుల పంపిణీ**

**ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమాలు**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 06:**

హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి 58వ జన్మదిన వేడుకలు పరకాల నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. గీసుగొండ మండలంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సంగెం, గీసుగొండ మండలాలతో పాటు 15, 16, 17 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జన్మదినాన్ని పురస్కరించుకుని ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇనగాల వెంకట్రామ్ రెడ్డిపై అభిమానంతో 320 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రత్యేకంగా రూపొందించిన టీ-షర్టులను అందజేసి అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి.. తన జన్మదినం సందర్భంగా భారీ సేవా కార్యక్రమాలు నిర్వహించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాలే తనకు బలమని పేర్కొన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. సమాజానికి ఉపయోగపడేలా భారీగా రక్తదానం చేసి, ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన యువతను ఆయన అభినందించారు. వేడుకలకు నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, ప్రజల కోసం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కనీస వేతన సలహా బోర్డు నుంచి CITUను మినహాయించడం దుర్మార్గం..

**నల్లగొండ సెప్టెంబర్ 6 విజయ కెరటం ప్రతినిధి**

మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల వైఖరికి నిదర్శనం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు మరో నిదర్శనం కేంద్ర కనీస వేతన సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణలో ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలైన CITU, AITUC, INTUC లకు ప్రాతినిధ్యం నిరాకరించడాన్ని CITU జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ లు తీవ్రంగా ఖండించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, వారు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నల్లజెండాలతో నెహ్రూగంజ్ హమాలి కార్యాలయం దగ్గర నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు, జీవన ప్రమాణాలు, ఉపాధి పరిస్థితులకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశంపై నిర్ణయాలు తీసుకునే కనీస వేతన సలహా బోర్డులో CITU, AITUC, INTUC వంటి దేశంలోని ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం పూర్తిగా అప్రజాస్వామికం, కక్షపూరితమైన చర్య అని వారు విమర్శించారు. 2026 జూలై 21న కేంద్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించిన కేంద్ర కనీస వేతన సలహా బోర్డు, వాస్తవానికి కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన త్రైపాక్షిక వేదికగా ఉండాలి. అయితే ప్రధాన కార్మిక సంఘాలను పక్కన పెట్టి, తనకు అనుకూలమైన వారితో బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా కార్మికుల వేతనాలను అణచివేయడానికి, యజమానులకు అనుకూలమైన విధానాలను చట్టబద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరుతో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ, కార్మికులకు మాత్రం "ఈజ్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటేషన్" పరిస్థితులను మోదీ ప్రభుత్వం సృష్టిస్తోంది. కార్మిక కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను హరించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు కనీస వేతనాల నిర్ణయ ప్రక్రియలో కూడా కార్మిక సంఘాల గొంతును నొక్కివేయడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన ధరలు, విద్యుత్ చార్జీలు, వైద్యం, విద్య, ఇల్లు, రవాణా ఖర్చులు నిరంతరం పెరుగుతున్నప్పటికీ, కార్మికుల నిజమైన ఆదాయాలు మాత్రం పడిపోతున్నాయి. మరోవైపు కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు, పన్ను మినహాయింపులు, ప్రజా ఆస్తుల అప్పగింతలు కొనసాగుతున్నాయి. కార్మికుల కనీస వేతనాల నిర్ణయంలో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లో ఏకాభిప్రాయంతో వచ్చిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి. కార్మిక కుటుంబం గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన వేతనం లభించేలా కనీస వేతనాలను శాస్త్రీయంగా నిర్ణయించాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలి. కానీ మోదీ ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించి పరిష్కారం కనుగొనే బదులు, కార్మిక సంఘాల ప్రాతినిధ్యాన్ని తొలగించి ఏకపక్ష నిర్ణయాలకు మార్గం సుగమం




చేస్తోంది. జ×ుఖను కనీస వేతన సలహా బోర్డు నుంచి తప్పించడం ద్వారా దేశంలోని కోట్లాది కార్మికుల సమస్యలను, వారి హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని అణచివేయలేరని వారు అన్నారు. కార్మికుల హక్కుల కోసం CITU పోరాటం బోర్డుల్లోని ప్రాతినిధ్యంతో ప్రారంభమైందీ కాదు, ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆగేదీ కాదు. కర్మాగారాల్లో, నిర్మాణ రంగంలో, రవాణా రంగంలో, అసంఘటిత రంగంలో, స్కీమ్ వర్కర్లలో, గిగ్--ప్లాట్‌ఫామ్ కార్మికుల్లో, ప్రభుత్వ--ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కోట్లాది కార్మికులతో కలిసి CITU నిరంతరం పోరాడుతుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ కక్షపూరిత వైఖరిని తెలంగాణలోని కార్మికవర్గం, అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, అసంఘటిత రంగ కార్మికులు ఐక్యంగా ఖండించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ హమాలీ యూనియన్ నాయకులు ఆవురేశు మారయ్య కాడింగ్ రవి, బోడ బక్కయ్య అశోక్ నరసింహ కృష్ణయ్య శంకర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు - పాదూరి శ్రీనివాస్ రెడ్డి పిఎసిఎస్ డైరెక్టర్ గోదా కృష్ణారెడ్డి ఆశీస్సులు

**విజయ కెరటం ప్రతినిధి తిప్పర్తి :**

మిర్యాలగూడలో జరిగిన వివాహ వేడుకలో తిప్పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాదూరి శ్రీనివాస్ రెడ్డి పిఎసిఎస్ డైరెక్టర్ గోదా కృష్ణారెడ్డి లతో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మామిడాల గ్రామానికి చెందిన అప్పాల శ్రీనివాస్--రమాదేవి దంపతుల కుమారుడు శ్రీధర్, నిహారికల వివాహానికి హాజరైన ఆయన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ తిప్పర్తి డైరెక్టర్ గోదా కృష్ణారెడ్డి, మామిడాల మాజీ సర్పంచ్ నాగరాణి అంబేద్కర్, వార్డు సభ్యులు కందుల సైదులు, విశ్వనాథుల పుల్లయ్య, నెల్లికంటి యాదగిరితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గంజాయి మహమ్మారిపై యువ కలం గర్జించాలి!

**డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా కవితలతో సమరశంఖం**

**వరంగల్:విజయ కెరటం సెప్టెంబర్ 06 :**



యువత భవిష్యత్తును ఛిద్రం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ మత్తు మహమ్మారిపై యువ కలం గళమెత్తనుంది. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో "యువతపై గంజాయి ప్రభావం--డ్రగ్స్ మాఫియాపై యుద్ధం మొదలైంది" అనే అంశంపై ఈ నెల 22న ఉదయం 9 గంటలకు వరంగల్‌లో రాష్ట్రస్థాయి యువ కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. గంజాయి, మత్తుపదార్థాల మాయలో చిక్కుకుంటున్న యువతను అప్రమత్తం చేయడంతో పాటు.. డ్రగ్స్ మాఫియా ఆగడాలపై ప్రజల్లో చైతన్యం రగిలించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు గల యువత నుంచి కవితలను ఆహ్వానిస్తున్నారు. గంజాయి, డ్రగ్స్ దుష్ప్రభావాలను ఎండగడుతూ, యువతను మత్తుకు దూరంగా ఉండేలా చైతన్యపరిచేలా 20 నుంచి 22 పంక్తుల్లో కవితలు రాయాలని కోరారు. ఆసక్తి ఉన్న కవులు తమ కవితలను ఈ నెల 22వ తేదీలోగా 8008200870 నంబర్‌కు పంపాలని సెర్ప్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ బొజ్జ సురేశ్ పిలుపునిచ్చారు.

మత్తు వద్దు.. యువత భవిష్యత్తు ముద్దు!

డ్రగ్స్ మాఫియాపై యువ కలం తిరగబడాలి!

## ఎస్సీ సెల్ సమావేశం.. కీలక చర్చలు

- రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ భేటీకి హాజరైన ముఖ్య నేతలు
- ముఖ్య అతిథులకు ఘన సన్మానం



**వరంగల్ విజయ కెరటం , సెప్టెంబర్ 6:**




టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ సమావేశం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ కమిటీ ఇన్‌చార్జి కొప్పుల రాజు, ఏఐసీసీ జాతీయ కో-ఆర్డినేటర్లు సిద్ధార్థ్ హత్తింబర్, మల్లికార్జున్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షం అశోక్, రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్లు బందెల రాజభద్రయ్య, డా. మడికొండ శ్రీను, ప్రధాన కార్యదర్శి దళిత రత్న దబ్బేట రమేష్, వరంగల్ జిల్లా చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, హన్మకొండ జిల్లా చైర్మన్ ఆరూరి సాంబయ్య తదితరులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అర్షం అశోక్ మాట్లాడుతూ.. "ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేస్తాం. కార్యకర్తలకు అండగా ఉంటాం" అని అన్నారు. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ సెల్‌ను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయడం తదితర అంశాలపై నాయకులు చర్చించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలను మరింత క్రియాశీలం చేయడం, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు గోవిందు శ్వేత, చేపూరి చిరంజీవి, చేపూరి వినోద్, కార్యదర్శి పుల్యాల గాంధీ, కొరివి అరుణ్, చంద్రశేఖర్, పరశురాం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్



**తిప్పర్తి సెప్టెంబర్ 6 విజయకేరటం ప్రతినిధి**



తిప్పర్తి గ్రామం పంచాయతీ పరిధిలోని నూకలవారిగూడంకి చెందిన గుండెబోయిన అశోక్ - విజయ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన లిగ్రామ సర్పంచ్ బద్దం రజిత సుధీర్ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ఇళ్లు కల్పించడం అభినందనీయం అని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూకల దేవకమ్మ సైదులు, వార్డు మెంబర్ తుమ్మల నాగరాజు, మాజీ సర్పంచ్లు గుండా సత్యనారాయణ, జాకటి మోష, రొట్టెల రమేష్, మాజీ ఎంపీటీసీలు పల్లె ఎల్లయ్య, కిన్నెర అంజి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోదా కృష్ణారెడ్డి, ఆదిమూలం ప్రశాంత్, వంగూరి కిరణ్, కిన్నెర రవి, బైరు వెంకన్న, తండు సైదులు, రావుల సందీప్, బైరు పవన్, గుండెబోయిన చంటి, బైరు వెంకటేష్, కటికర్ల మోహన్, నూకల సత్యనారాయణ, దయ్యాల శివ, రొంపి వెంకన్న, తూటిపెల్లి శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయకేరటం
తెలుగు దినపత్రిక

## హైదరాబాద్ ప్రజలకు గుడ్ న్యూస్: మెట్రో - ఆర్టీసీ జాయింట్ పాస్‌ల జారీకి సీఎస్ ఆదేశాలు!



నగర ప్రయాణికుల ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (CS) సంజయ్ జాజు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్, TGSRTC బస్సుల్లో ఒకే పాస్‌తో ప్రయాణించేలా 'జాయింట్ పాస్' విధానాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ పాస్ విధానం: ప్రజల సౌకర్యార్థం డైలీ (రోజువారీ), మంత్లీ (నెలవారీ) జాయింట్ పాస్‌లను వెంటనే అమలు చేయాలని సూచన. సాంకేతికంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఛార్జీల ఖరారు పూర్తికాగానే ఇది అందుబాటులోకి వస్తుందని అధికారులు వెల్లడించారు. పాతబస్తీ మెట్రో విస్తరణ: పాతబస్తీలో 7.5 కిలోమీటర్ల పరిధిలోని మెట్రో కారిడార్ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసి, ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని స్పష్టం చేశారు. మెట్రోలో ప్రయాణించిన సీఎస్: బేగంపేట మెట్రో భవన్‌లో HMRL, TGSRTC, జలమండలి, విద్యుత్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన అనంతరం, బేగంపేట నుండి ప్యారడైజ్ వరకు మెట్రోలో ప్రయాణించి స్టేషన్ల పరిధిలోని పార్కింగ్, వాణిజ్య సముదాయాలు మరియు సీఎ–44 ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, విద్యార్థులకు మరియు ఉద్యోగులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం.

మహ్మద్ అమ్జద్ ఖాన్
సామాజిక కార్యకర్త (Social Activist)
@TelanganaCS ఏంయిఖయబ1
#HyderabadMetro #TGSRTC #HyderabadCity #PublicTransport #OldCityMetro #MohdAmjadKhan #TelanganaNews

## శ్రీశ్రీశ్రీ త్రిపుర సుందరి దేవి (తిప్పలమ్మ తల్లి) శోభయాత్రను ప్రారంభించిన గ్రామ సర్పంచ్





**తిప్పర్తి సెప్టెంబర్ 6 విజయకేరటం ప్రతినిధి**

ఈరోజు తిప్పర్తి గ్రామపంచాయతీ పరిధిలోని తిప్పలమ్మగూడెం లోని శ్రీశ్రీశ్రీ త్రిపుర సుందరి టతిప్పలమ్మ తల్లికిఊ ఉత్సవాలలో భాగంగా తిప్పలమ్మ తల్లి శోభయాత్రను ట్రాక్టర్ నడిపి ప్రారంభం చేసిన తిప్పర్తి గ్రామ సర్పంచ్ బద్దం రజిత సుధీర్ ఈ సందర్భంగా సర్పంచ్ బద్దం రజిత – సుధీర్ మాట్లాడుతూ.. ఆ త్రిపుర సుందరి దేవి టతిప్పలమ్మ తల్లిఊ తిప్పర్తి గ్రామ ప్రజలను ఆయురారోగ్యాలతో అష్టశ్వర్యాలతో పాడి పంటలతో అమ్మవారి చల్లని దీవెనలు గ్రామ ప్రజల అందరిపై ఉంచాలి కోరారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ డైరెక్టర్ గోద కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు జాకటి మోష, రొట్టెల రమేష్, గుండా సత్యనారాయణ, మాజీ ఎంపిటిసిలు పల్లె ఎల్లయ్య, కిన్నెర అంజి, ఉప సర్పంచ్ నూకల దేవకమ్మ సైదులు,మండల నాయకులు ఆదిమూలం ప్రశాంత్, నల్లరాజు శ్రీను, తండు సతీష్ గౌడ్, వార్డు మెంబర్లు, లవిశెట్టి లక్ష్మణ్, నల్లరాజు సందీప్, వంగూరి సుజాత కిరణ్, తుమ్మల నాగరాజు, కిన్నెర రవి, గుండా సంధ్య సంతోష్, చింతకుంట్ల రేణుక మధు మరియు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రపంచ సుందరిగా జొహైరీ మోలా.. ఎవరీమె? బ్యాక్‌గ్రౌండ్ ఇదే!

**మిస్ వరల్డ్ 2026గా డొమినికన్ రిపబ్లిక్ భామ జొహైరీ మోలా**

**వియత్నాంలో జరిగిన 73వ ఎడిషన్ పోటీల్లో విజయం**

**44 ఏళ్ల తర్వాత డొమినికన్ రిపబ్లిక్‌కు దక్కిన ప్రపంచ సుందరి కిరీటం**

**రన్నరప్‌లుగా స్పెయిన్, మలేషియా సుందరీమణులు**

ప్రతిష్ఠాత్మక మిస్ వరల్డ్ 2026 కిరీటాన్ని డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జొహైరీ మోలా డొమింగ్యూజ్ గెలుచుకున్నారు. వియత్నాంలోని న్హా ట్రాంగ్‌లో శనివారం రాత్రి అట్టహాసంగా జరిగిన 73వ మిస్ వరల్డ్ ఫైనల్స్‌లో ఆమె విజేతగా నిలిచారు. గత ఏడాది విజేత, థాయ్‌లాండ్‌కు చెందిన సుచతా చువాంగ్‌శ్రీ.. జొహైరీకి కిరీటాన్ని అలంకరించారు. ఈ విజయంతో దాదాపు 44 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత డొమినికన్ రిపబ్లిక్‌కు మిస్ వరల్డ్ టైటిల్ దక్కింది. 1982లో మరియాసెలా అల్వారెజ్ ఆ దేశం తరఫున తొలిసారి ఈ కిరీటాన్ని గెలుచుకున్నారు.ప్రపంచవ్యాప్తంగా 110 దేశాల నుంచి వచ్చిన సుందరీమణులతో పోటీపడి జొహైరీ మోలా ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ పోటీలో స్పెయిన్‌కు చెందిన ఎలిసబెత్ రేనెస్ ఫస్ట్ రన్నరప్‌గా, మలేషియాకు చెందిన తానుసియా శెట్టి సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. వియత్నాం, ఎరిత్రియా, దక్షిణాఫ్రికా దేశాల ప్రతినిధులు టాప్ 6లో స్థానం సంపాదించారు. వియత్నాం మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం.24 ఏళ్ల జొహైరీ మోలా విద్య, మోడలింగ్, జర్నలిజం వంటి బహుళ రంగాల్లో రాణిస్తున్నారు. యూనివర్సిడాడ్ ఇబెరోఅమెరికానా నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఆమె.. ఒకవైపు ప్రొఫెషనల్ మోడల్‌గా కొనసాగుతూనే, మరోవైపు సాహిత్యం, సోషల్ స్టడీస్ టీచర్‌గా పనిచేస్తున్నారు. అంతేకాకుండా, యూనివిజన్ న్యూయార్క్ ఛానెల్ కోసం న్యూస్ కరస్పాండెంట్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆమెకు స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉంది."వాయిసెస్ ఆఫ్ టుమారో" పేరుతో జొహైరీ స్థాపించిన సేవా కార్యక్రమం ఆమె విజయానికి బాటలు వేసింది. పేద వర్గాల పిల్లలు, యువతకు ఇంగ్లిష్ విద్యను అందించడమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ఫైనల్ రౌండ్‌లోనూ ఇదే అంశంపై మాట్లాడుతూ.. "పేద పిల్లలకు ఇంగ్లిష్ విద్యను అందించడం వారి జీవితాల్లో గొప్ప అవకాశాలకు తలుపులు తెరుస్తుంది" అని ఆమె చెప్పిన సమాధానం న్యాయనిర్ణేతలను ఎంతగానో ఆకట్టుకుంది. "బ్యూటీ విత్ ఎ పర్పస్" అనే మిస్ వరల్డ్ నినాదానికి ఆమె నేపథ్యం, లక్ష్యాలు సరిగ్గా సరిపోవడంతో విజయం ఆమెను వరించింది.






## తన విషయంలో దర్శకుడు ఎంత ముఖ్యమో చెప్పిన టబు

దశాబ్దాలుగా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్న సీనియర్ నటి టబు, ఒక నటిగా తన విజయంలో దర్శకుడి పాత్ర ఎంత కీలకమో వివరించారు. తాను పూర్తిగా 'డైరెక్టర్స్ యాక్టర్' అని, తన నటన దర్శకుడి ప్రతిభపైనే ఆధారపడి ఉంటుందని ఓ పాత మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఒక సినిమా బాగుండాలన్నా, బాగోలేకపోయినా దానికి ప్రధాన కారణం దర్శకుడేనని టబు బలంగా నమ్ముతారు. "నా నటన, అంతకంటే ముఖ్యంగా సినిమా ఫలితం దర్శకుడిపై ఆధారపడి ఉంటుంది. అందుకే నాకు మంచి దర్శకుడితో పనిచేయడం చాలా ముఖ్యం" అని ఆమె పేర్కొన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత మంచి సినిమానే అని, ఆ తర్వాతే తన పాత్ర గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. "నాకు మంచి పాత్ర లభించినా, దాని నుంచి అత్యుత్తమ నటనను రాబట్టుకోవాల్సింది దర్శకుడే. ఈ విషయంలో నేను పూర్తిగా దర్శకుడిపైనే ఆధారపడతాను" అని టబు వివరించారు.1985లో దేవ్ ఆనంద్ 'హమ్ నౌజవాన్' చిత్రంతో టీనేజ్‌లోనే వెండితెరపై కనిపించిన టబు, 1991లో వెంకటేష్ హీరోగా వచ్చిన తెలుగు చిత్రం 'కూలీ నెం. 1'తో కథానాయికగా అరంగేట్రం చేశారు. ఆ తర్వాత 1994లో విడుదలైన బాలీవుడ్ చిత్రం 'విజయ్‌పథ్'తో ఆమె మొదటిసారిగా భారీ విజయాన్ని అందుకున్నారు.ఇక ప్రస్తుతం, టబు 'దృశ్యం 3: ది కన్‌క్లూజన్' చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో ఆమె మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మీరా దేశ్‌ముఖ్ పాత్రను మరోసారి పోషించబోతున్నారు. అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, జైదీప్ అహ్లావత్, ఇషితా దత్, శ్రియా శరణ్, రజత్ కపూర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్న ఈ పనోరమా స్టూడియోస్ ప్రొడక్షన్, 2026 అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528